## పలు కుటుంబాలకు మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

చివ్వెంల, నవంబర్ 14 : మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ న్యాయవాది డపుకు మల్లయ్య తండ్రి పెద వెంకయ్య(65), అలాగే తుల్జారావుపేటకు చెందిన మాజీ సర్పంచ్ బానోతు చాంప్లానాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, సర్పంచులు దొంగరి కోటేశ్వర్‌రావు, సుధాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు రౌతు నర్సింహారావు, బాబూనాయక్ ఉన్నారు.

పెన్‌పహాడ్ : బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి, మండలంలోని చీదెళ్ల గ్రామానికి చెందిన కీర్తి ఎలమంచయ్య తండ్రి నర్సయ్య(65) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని మంత్రి సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచులు పరెడ్డి సీతారాంరెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, నాయకులు తూముల ఇంద్రసేనారావు, మండాది నగేశ్, మిర్యాల వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, నల్లపు శ్రీనివాస్, కీర్తి వెంకట్రావ్, రణపంగ సైదులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు బాలకిషన్ ముండా



పెన్‌పహాడ్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు బాలకిషన్ ముండా

సూర్యాపేట, నవంబర్ 14 : ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు బాలకిషన్ ముండా అధికారులను ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి, పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్‌లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. తాగునీరు, లైటింగ్, ఫ్యాన్స్, మరుగుదొడ్లు, ర్యాంపులు తప్పకుండా ఉండాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ లిస్ట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్ రమేశ్‌నాయక్, రెవెన్యూ అధికారులు రామారావు, నవీన్ పాల్గొన్నారు.

## పోలింగ్ రోజు నిరంతర విద్యుత్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 14 : పోలింగ్ తేదీ నవంబర్ 30న పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి విద్యుత్, ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులతో ఎన్నికల విధుల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటింగ్ యాంత్రాలతో పాటు పోలింగ్ నిర్వహణ సిబ్బందిని కేంద్రాలకు చేర్చేందుకు రవాణా సదుపాయం తప్పక ఉండాలని ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలను నిరంతరం పరిశీలన చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ వెంకట్‌రెడ్డి, విద్యుత్ ఎస్‌ఈ సతీశ్ పాల్‌రాజ్ పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చు వివరాలు రోజూ నమోదు చేయాలి

- నియోజక వర్గ వ్యయ పరిశీలకుడు విజయ్ నట్కే



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ నట్కే

సూర్యాపేట, నవంబర్ 14 : అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులు రోజు వారీగా ఆర్వో కార్యాలయంలో ఇవ్వాలని, సిబ్బంది వెంటనే ఆ లెక్కలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని నియోజక వర్గ వ్యయ పరిశీలకుడు విజయ్ నట్కే అధికారులకు సూచించారు. మంగళవారం సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి వ్యయ పరిశీలన టీమ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వ్యయ అభ్యంతరాలపై 8019224583 నంబర్‌కు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు.

### దివ్యాంగులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు..

నియోజక వర్గంలోని దివ్యాంగులు, 80 ఏండ్లకు పైబడిన వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేలా సెక్టోరల్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీర బ్రహ్మాచారి సూచించారు. ఆర్వో కార్యాలయంలో సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో 5 టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ టీమ్‌లు రూట్ మ్యాప్ ప్రకారం ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైడిన వారితో ఓటు వేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో శ్యామ్‌సుందర్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణయ్య, రంగారావు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆగం పట్టించిన కాంగ్రెస్సా.. అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్సా

- ప్రజలు ఆలోచించి ఓటేయాలి
- మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత



సూర్యాపేట టౌన్ : సూర్యాపేటలోని 17వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

సూర్యాపేట టౌన్, నవంబర్ 14 : ఎన్నో ఏండ్లు పాలించి అన్ని విధాలుగా ఆగం చేసి కష్టాల పాలు చేసిన కాంగ్రెస్ పార్టీ కావాలా.. పోరాడి.. రాష్ట్రాన్ని సాధించి.. అన్ని రంగాల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రశాంత పాలన కావాలో ప్రజలు ఆలోచించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 17, 44 వార్డుల్లో ఆమె ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను రెండుసార్లు ప్రజలంతా అభిమానంతో ఆదరించి ఓట్లు వేసి గెలిపిస్తే ఎంతటి అభివృద్ధి జరిగిందో అంతా కండ్ల చూస్తున్నామన్నారు. అభివృద్ధి, ప్రశాంత పాలన ఇలాగే కొనసాగేందుకు మరోమారు బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటేసి జగదీశ్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతలపాటి భరత్ మహాజన్, వార్డు అధ్యక్షుడు చల్లా లక్ష్మీకాంత్, సల్మా మస్తాన్, సారంగుల కరుణశ్రీ, రాచూరి రమణ, ఢిల్లీ పావనీ, వాంకుడోతు పద్మ, విజయ చక్రూనాయక్ పాల్గొన్నారు.

### 30వ వార్డులో న్యాయవాదుల ప్రచారం..

మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతుగా సూర్యాపేటలో న్యాయవాదులు వాడవాడలా తిరుగుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ఇంటింటికీ వివరిస్తూ ప్రచారం చేశారు. 30వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మోదుగు వెంకట్‌రెడ్డి, తల్లమల్ల హస్సేన్, రేగట్టి లింగయ్య, పిట్టల వెంకటేశ్వర్లు, లతీఫ్, ఇబ్రహీం, నారాయణ, యాదగిరి, శంకరయ్య, 30వ వార్డు ఇన్‌చార్జి గాలి సాయి, రామ్ ప్రసన్న పాల్గొన్నారు.

### మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి..

సూర్యాపేట రూరల్ : ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని రామ్లాతండా, రూప్లాతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



సూర్యాపేట టౌన్ : సూర్యాపేటలోని 30వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న న్యాయవాదులు



సూర్యాపేట రూరల్ : రూప్లాతండాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ భిక్షం

## ఎన్నికల సజావుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ఎన్నికల జిల్లా పోలీస్ పరిశీలకుడు పర్వత్ అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పోలీస్ పరిశీలకుడు పర్వత్ అబ్బాస్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, నవంబర్ 14 : ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల జిల్లా పోలీస్ పరిశీలకుడు, వెస్ట్ బెంగాల్ డీఐజీ పర్వత్ అబ్బాస్ కోరారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న 16 రోజులు చాలా ముఖ్యమని, సమస్యలు తలెత్తకుండా అధికారులంతా బాధ్యతతో పని చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లోని గ్రామాల్లో నిఘా భద్రతను కట్టుదిట్టం చేయాలని, చెక్ పోస్టుల్లో వాహనాల తనిఖీలు చేస్తూనే ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. విధుల నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ఎన్నికలకు ముందు 48 గంటల్లోపు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, 24 గంటల్లోపు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై అవగాహన ఉండాలన్నారు. ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి ముందస్తు బైండోవర్ చేయాలన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. ట్రబుల్స్ మాంగర్స్‌ను బైండోవర్ చేయడం, సమస్మాత్మక ప్రాంతాల్లో తీసుకున్న రక్షణ చర్యలు, వాహనాల తనిఖీలు, స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం వివరాలు, కేంద్ర బలగాల సద్వినియోగం, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టెకింగ్ పోర్ట్స్, ఎంసీపీ, స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్ పని విధానం, సోషల్ మీడియా మానిటరింగ్ తదితర అంశాలను డీఐజీ పర్వత్ అబ్బాస్‌కు వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాశ్, రవి, శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఎన్నికల సెల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మాలధారులకు నిత్యాన్నదానం

బొడ్రాయిబజార్, నవంబర్ 14 : వివిధ దేవతా మూర్తుల మాలధారులకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యంగా భావిస్తున్నట్లు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య అన్నారు. మంగళవారం శబరీనగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో వివిధ దేవతామూర్తుల మాలధారులకు సొంతంగా రూ.5 లక్షల వ్యయంతో 45 రోజుల పాటు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా వాసుదేవ్, అయ్యప్ప దేవాలయ కమిటీ అధ్యక్షుడు బెలిదె శ్రీనివాస్, కార్యదర్శి ఎల్గూరి రాంబాబు, కోశాధికారి బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాలధారులకు అన్నదానం ప్రారంభిస్తున్న సోమనర్సయ్య, మీలా వాసుదేవ్